క్లుప్తంగా

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు



జనపనార సంచులను పంపిణీ చేస్తున్న విద్యార్థులు

భీమవరం: పర్యావరణ పరిరక్షణపై పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు రెగ్యులర్ క్యాంపులో భాగంగా ఆదివారం మావుళ్లమ్మ సెంటర్‌లో ప్రదర్శన నిర్వహించారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి ముప్పు అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలకు సుమారు 500 జనపనార సంచులు పంచిపెట్టారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వి.కమల్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి పి.కళ్యాణ్, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

కొండచిలువ పట్టివేత



పట్టుబడిన భారీ కొండ చిలువ

భీమవరం: రెండో పట్టణంలోని 36వ వార్డు రామాలయం వద్ద అనాకోడేరు కాలువలో కొండ చిలువ ఆదివారం కలకలం రేపింది. సుమారు 12 అడుగుల కొండ చిలువను స్థానికులు గుర్తించి గోసంరక్షణ అధ్యక్షుడు సుంకర దాసుకు సమాచారం అందించారు. మున్సిపల్ అధికారులను సంప్రదించి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణ సాయంతో ఆ కొండచిలువను పట్టుకొని బయటకు తీసుకొచ్చారు. ఆ కొండ చిలువను సంబంధిత అధికారులకు ఫారెస్ట్ అధికారులకు అందించారు. కొండ చిలువను అటవీ ప్రాంతంలో విడిచిపెడతామని అధికారులు తెలిపారు.

సూర్య భగవానుడికి అష్టోత్తర పూజలు



సూర్య భగవానుడికి అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): మాఘ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం భీమవరం మెంటే వారి తోటలోని విజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాలా త్రిపుర సుందరి అమ్మవారి దేవస్థానంలో సూర్య భగవాన్‌కి అష్టోత్తర పూజలను నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో అర్చకులు కొమ్ము శ్రీనివాస్ పట్టణానికి చెందిన బొల్లం దుర్గారావు, ఉమాదేవి దంపతులచే సూర్య భగవానుడికి పూజ కార్యక్రమాలు, సూర్య భగవాన్‌కి అష్టోత్తర పూజ నిర్వహించారు. అనంతరం హోమం, పరమాన్నం నైవేద్యం సమర్పించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, బాలా త్రిపుర సుందరి మహిళ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పంపిణీ కాని ఓటరు స్లిప్పులు

ఉండి: నియోజకవర్గ కేంద్రం ఉండిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు స్లిప్పుల పంపిణీ కాకపోవడంతో ఓటర్లు అయోమయానికి గురవుతున్నారు. ఆదివారం ఉండిలోని కూర్మావారి వీధిలోని ఓటర్లకు స్లిప్పులు పంపిణీ కాకపోగా స్లిప్పులు పంపిణీ చేసినట్లు ఫోన్ ద్వారా మెస్సేజ్‌లు రావడంతో వారంతా అవాక్కయ్యారు. ఉండిలోని బీఎల్‌వోలకు ఒక్కొరికీ 30 మంది చొప్పున ఓటరు స్లిప్పులు ఉండగా వాటిని ఇంత వరకు పంపిణీ చేయకపోగా పంపిణీ చేసినట్లు ఓటర్ల ఫోన్లకు మెస్సేజ్‌లు రావడంతో అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనగా కనబడుతుందని ఓటర్లు వాపోతున్నారు. ఇప్పటికే ఓటర్ల జాబితా తప్పుల తడకగా ఉందంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు ఓటరు స్లిప్పులు కూడా పంపిణీ చేయకుండా చేసినట్లు చెప్తారా అని ఓటర్లు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని గ్రాడ్యుయేట్ ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఓటర్లు కోరుతున్నారు.

నేటి నుంచి శివరాత్రి మహోత్సవాలు

ఉండి: రాజులపేటలో వేంచేసియున్న పార్వతీ సమేత చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 24వ తేదీ సోమవారం నుంచి 28వ తేదీ శుక్రవారం వరకు మహాశివరాత్రి, కల్యాణ మహోత్సవాలు చేస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి రోజూ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 25వ తేదీన వైభవంగా స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు.అలాగే ప్రతి రోజూ పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు తెలిపారు. కావున భక్తులు ఈ మహోత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని తెలిపారు.

మలుపులు.. ప్రమాదానికి పిలుపులు

- కానరాని సూచిక బోర్డులు
- తరచూ ప్రమాదాలు.. పట్టించుకోని అధికారులు



వీరవాసరం మండలంలో ప్రమాదకరంగా ఉన్న రహదారి మలుపు

వీరవాసరం: రహదారిపై ప్రయాణించాలంటే ప్రయాణికులు, వాహన చోదకులు భయభ్రాంతులకు గురవుతున్నారు. దీనికి కారణం మండల కేంద్రమైన వీరవాసరం నుంచి బ్రాహ్మణ చెరువు వెళ్లే రహదారిలో పెద్ద పెద్ద మలుపులు ఉన్నాయి. వీరవాసరం మొదలుకుని రైల్వే గేట్ దాటాక పాత కలప వ్యాపార సమీపంలో ఒక మలుపు, తోకలపూడి దాటగానే గంధం వెంకటస్వామి నాయుడు చెరువుల వద్ద రెండు మలుపులు, ఉన్నాయి. తోలేరు చింత పెట్రోల్ బంకు సమీపంలో ఒక మలుపు, పంజా వేమవరంలో మరో మలుపు, బుధ రాయుడు చెరువు వద్ద రెండు మలుపులు, నవుడూరు జంక్షన్ సమీపంలో ఒక మలుపు, పాలమూరు సమీపంలో మరో మలుపు ఉన్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక నిరంతరం పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రహదారికి ఏ ఒక్క ప్రాంతంలోనూ సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రయాణికులు, వాహన చోదకులు వాపోతున్నారు. అడ్డదారిపై ఉన్న మలుపులు కావని ప్రమాదానికి తలుపులని ప్రజలంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి రహదారి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

> **సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి**
>
> 
>
> వీరవాసరం నౌడూరు జంక్షన్ రహదారిపై ప్రయాణించాలంటేనే భయం భయంగా ఉంటుంది. మలుపుల్లో ఏ వాహనం ఎటు నుంచి వస్తుందో తెలియక తికమక పడి రహదారి ప్రమాదాలకు గురవుతున్నాం. రహదారిని వెడల్పుచేసి, సూచికబోర్డులు ఏర్పాటు చేయాలి.
>
> – జవ్వాది సరేష్ నాయుడు, రాయకుదురు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: పట్టణంలోని ఏఎస్సార్ నగర్‌లో ఇండోర్ విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో చినఅమిరం ఫీడర్‌పై సోమవారం వార్షిక మరమ్మతుల నిమ్మిత్తం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్ కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. రాయలం బైపాస్ రోడ్డులోని కొన్ని ప్రాంతాలు, చినఅమిరం గ్రామానికి ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు నగర పంచాయతీ సమావేశం

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం ఈ నెల 24వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాలులో నిర్వహిస్తామని చైర్పర్సన్ జామి హైమావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో స్థానిక సమస్యలపై సమీక్ష, అజెండాలోని అంశాలపై చర్చిస్తారని తెలిపారు. కౌన్సిల్ సభ్యులు హాజరుకావాలని సూచించారు.

రేపు మార్కండేయుని కల్యాణం

- మహాశివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు
- రాజరాజేశ్వరి ఆలయంలో లక్ష రుద్రాక్ష సహస్ర ఘటాభిషేకం



లక్ష రుద్రాక్షలతో ఏర్పాటు చేసిన శివలింగం (ఫైల్)

ఆకివీడు: మహా శివరాత్రి ఏర్పాట్లు శైవ క్షేత్రాల్లో ముమ్మరంగా సాగుతున్నాయి. శివరాత్రి సందర్భంగా ఈ నెల 25 నుంచి ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. స్థానిక జవహర్‌పేటలోని రాజరాజేశ్వరి సహిత మార్కండేయ స్వామి పురాతన ఆలయంలో 39వ మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా 26వ తేదీ బుధవారం ఆలయంలో లక్ష రుద్రాక్ష సహస్ర ఘటాభిషేక మహోత్సవం నిర్వహించనున్నారు. 25వ తేదీన ధ్వజారోహణం, గోపూజ, గణపతి హోమం, రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వర స్వామి వార్ల కల్యాణోత్సవం దంపతులచే సామూహికంగా నిర్వహించనున్నారు. లక్ష రుద్రాక్ష ఏకలింగంకు అభిషేకం సందర్భంగా 1008 కలశాలతో 1000 లీటర్ల ఆవు పాలు, సుగంధ ద్రవ్యాలతో నింపి కన్యలు, సువాసినీలతో కాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తారు. అనంతరం శ్రీసూక్త హోమం, లక్ష బిల్వార్చన, లక్ష కుంకుమార్చన, లక్ష దీపారాధన, అనంతరం రాత్రి లింగోద్భవ కాలంలో అన్నాభిషేకం, రుద్ర హోమం, 27వ తేదీన పూర్ణాహుతి, త్రిశూల స్నానం, ఏకాంత సేవ నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు గొంట్లా గణపతి, కాకర్ల రాజరాజేశ్వరి, కె.ఫణీశ్వర్‌నాథ్ చెప్పారు. ఆలయంలో స్వామి వార్లకు ప్రతి ఒక్కరూ స్వయంగా అభిషేకం చేసుకునే అవకాశం ఉందన్నారు. అదే విధంగా స్థానిక పిల్లల మర్రి అగ్రహారంలోని వెంకట లింగేశ్వరస్వామి ఆలయంలోనూ, పురాతన భీమేశ్వర స్వామి ఆలయంలోనూ, మాదివాడలోని మల్లేశ్వర స్వామి, అయిభీమవరంలోని అమృతలింగేశ్వర స్వామి ఆలయంలోనూ, కోళ్లపర్రులోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో, సిద్ధాపురంలో నూతనంగా నిర్మించిన రామలింగేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

హామీలు అమలు చేసి ఓట్లు అడగాలి



పత్రికా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్

ఉండి: అధికారంలోకి రావడానికి చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థికి ఓట్లు వేయమని అడగాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి జీవీ సుందర్ అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఓట్లు అడిగే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉండిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇచ్చి ఓట్లు అడగాలన్నారు. స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు, రైతులకు ఏటా రూ.20 వేలు, 19 నుంచి 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1500, ప్రతి మహిళకు ఉచిత బస్సు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్, డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణం రూ.10 లక్షలు, బీసీలకు ఆదరణ, ప్రత్యేక చట్టంలో భాగంగా రూ.5 వేల కోట్లు, స్థానిక సంస్థల నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్, హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు రూ.లక్ష ఆర్థిక సాయం, బ్యాడ్జ్ ఉన్న డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు, పూజారులకు ప్రతి ఏటా రూ.15 వేలు, చేనేత కుటుంబాలకు ఏడాదికి రూ.24 వేలు, రూ.25 లక్షల ఆరోగ్య బీమా, మత్స్యకార కుటుంబాలకు వేట విరామంలో రూ.20 వేలు, బీపీ, షుగర్ బాధితులకు ఉచిత మందులు, ఉచిత ఇసుక, ఎస్సీ పథకాల పునరుద్ధరణ, మెడికల్ కళాశాలల్లో అడ్మిషన్ విధానంలో పాత పద్ధతిని అమలు చేయడం వంటివి నెరవేర్చిన తరువాత చంద్రబాబు గాని కూటమి నాయకులు గాని తమ అభ్యర్థికి ఓట్లు వేయమని అడగాలని కోరారు. గ్రూప్–2 అభ్యర్థుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య, నిరంకుశ వైఖరిని ఎండగడుతూ గ్రాడ్యుయేట్స్ అందరూ ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. అన్యాయం జరిగిందని ఉద్యమాలు, ధర్నాలు చేయడం కంటే ఓటుతోనే తమ సత్తా ఏమిటో చూపించాలన్నారు. తాను ప్రత్యేకంగా మేనిఫెస్టో రూపొందించానని గ్రాడ్యుయేట్స్ అంతా తన మేనిఫెస్టో చదివి తనకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని కోరుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాటం స్టాలిన్, నాగరాజు, దానం విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు జోనల్ క్రీడా పోటీలు

ఆకివీడు: ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం పెంపొందించేందుకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యా శాఖాధికారి ఎ.రవీంద్ర ఆదివారం చెప్పారు. మండలంలోని సిద్ధాపురం గ్రామంలోని దామోదరం సంజీవయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 24 నుంచి రెండు రోజుల పాటు నియోజకవర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. గేమ్స్, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలుంటాయన్నారు. పోటీల్లో గెలుపొందిన వారు జిల్లా స్థాయి పోటీల్లోనూ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓ తెలిపారు. క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, తమ క్రీడా ప్రతిభను కనబర్చాలన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉప విద్యాశాఖాధికారి రమేష్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

వీరవాసరం: జిల్లాలో ఎంతో పేరు ప్రతిష్ఠలున్న వీరవాసరం ఎంఆర్‌కే జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తిష్ట వేసిన సమస్యలు సుదీర్ఘ కాలంగా పరిష్కారం కాకపోవడం వలన జిల్లా ఉప విద్యాశాఖాధికారి నారగన రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఆర్‌కే జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రమేష్‌తో పదో తరగతి చదువుకున్న 1986–87 తన తోటి పూర్వపు విద్యార్థులు రమేష్‌ను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఎంఆర్‌కే జిల్లా పరిషత్ హైస్కూల్ వేదికగా పాలా శ్రీనివాస్‌రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రమేష్ మాట్లాడుతూ తన పరిధి ఉన్నంత వరకు హైస్కూల్ సమస్యలను పరిష్కరించడానికి, విద్యా చట్టం అమలు కృషి చేస్తానన్నారు. జిల్లాలో విద్యావ్యవస్థలలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళతానని తెలిపారు. హైస్కూల్ సమస్యలు ఉన్నతాధికారుల దృష్టిలో ఉన్నట్టు తెలిపారు. అంతకు ముందు పలువురు పూర్వపు విద్యార్థులు మాట్లాడుతూ రమేష్ మరింత ఉన్నతాధికారి స్థాయికి వెళ్ళాలని ఆకాంక్షించారు. అనంతరం రమేష్, సుభద్ర దంపతులను పూలమాలలతో నత్కారించి మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో శనివారపు ప్రసాదు, ముద్రగళ శ్రీనివాస్, ఏలూరి భానుకుమారి, గుల్లిపల్లి తులసి,నిమ్మల దుర్గ, గుండా లక్ష్మీమంగతాయారు, భారతీ, వలవల జానకిరావు, రాములు పాల్గొన్నారు.

పంచాయతీపై అసత్య ఆరోపణలు తగవు



పెన్నాడలో మాట్లాడుతున్న సర్పంచ్ చిల్లా అనూష, వార్డు సభ్యులు

పాలకోడేరు: మండలంలోని పెన్నాడ గ్రామ పంచాయతీలో ఎటువంటి అవినీతి జరలేదని, దీనిపై ఎటువంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నట్లు సర్పంచ్ చిల్లా అనూష అన్నారు. స్థానిక సచివాలయం వద్ద ఆదివారం గ్రామస్తులు, పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనూష మాట్లాడుతూ పంచాయతీలో కోట్లాది రూపాయలు అవకతవకలు జరిగాయని కొంతమంది అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. కొన్ని చానళ్లు కావాలనే బురద జల్లే ప్రయత్నం చేశారని ఇది సమంజసం కాదన్నారు. నిరంతరం గ్రామస్తులకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశామన్నారు. అటువంటిది తమపై, తమ పంచాయతీపై అవినీతి ఆరోపణలు చేయడం సరి కాదన్నారు. తమపై లేనిపోని ఆరోపణలు చేసిన వారిపై లీగల్‌గా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీ పాలక వర్గ సభ్యులు బ్రహ్మాజీ, శివ, విక్రమ్, మమత, కల్యాణి, ఏసు, నామన ఆంజనేయులు, పుష్పలత మాట్లాడుతూ గ్రామస్తులు తమను ఎంతో నమ్మకంతో ఎన్నుకున్నారని ఆ విధంగానే గ్రామస్తులకు సేవలందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బాబులు, బ్రహ్మాజీ, రాము, పెంటన్న, పాండ్రంకి శ్రీను, పిల్లా శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయం



నెలవారీ బియ్యం పంపిణీ చేస్తున్న గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ ఫౌండర్ చెన్న త్రికల సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నెలవారీ బియ్యం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. లార్డ్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్ హోమ్‌కు 150 కేజీలు, నిడదవోలు లెపర్స్ కాలనీ వారికి 300 కేజీలు, పడాల జీవన సంధ్యా వృద్ధాశ్రమానికి 20 కేజీలు అందజేశారు. ట్రస్టీ, వైఎస్సార్‌సీపీ నాయకులు చెన్న జనార్ధనరావు ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. సేవలు అందుకున్న నిర్వాహకులు ఆర్గనైజేషన్‌కు, దాతలకు కృతజ్ఞతలు వెల్లడించారు. దుర్గా ప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు





తణుకులో విశేషాలంకరణలో ముస్తాబైన సూర్యభగవానుడు, సూర్యాలయం వీధిలో క్యూకట్టిన భక్తులు

తణుకు అర్బన్: మాఘ మాసం ఆఖరి ఆదివారం సందర్భంగా తణుకు సూర్యదేవాలయానికి భక్తులు పోటెత్తారు. సూర్యనారాయణస్వామికి ఆదివారం ప్రీతికరమైన రోజుకావడం, మాఘ మాసం కావడంతో స్వామిని రకరకాల పుష్పాలు, తులసీ దళాలతో ప్రత్యేకంగా అలంకరించారు. దినకరుడిని ఆరోగ్యదాతగా కొలిచే భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలిరావడంతో సూర్యాలయం వీధి పొడవునా భారీ క్యూకట్టారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో పూజాధికాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

జోరుగా ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం



దుంపగడపలో ఎమ్మెల్సీ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులను గెలిపించాలని ప్రచారం చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆకివీడు: ఉద్యోగ సమస్యలపై పోరాటాలకు ముందుండి మద్దతదు పలికే వ్యక్తి, ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవుల్ని గెలిపించాలని సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు పెంకి అప్పారావు పిలుపునిచ్చారు. మండలంలోని దుంపగడపలోని బోసురాజు కాలనీ, తిమ్మరాజు కాలనీ, పలుచోట్ల ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా అప్పారావు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించే హక్కులను కాపాడే మేధావులను పెద్దల సభలకు పంపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పట్టభద్రుల మొదటి ప్రాధాన్యతా ఓటుతోనే వీరరాఘవులు విజయం సాధిస్తారన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. కరపత్రాలను ఓటర్లకు అందజేశారు.కార్యక్రమంలో నాయకులు రౌతుల రామ ప్రసాద్ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చదరంగం పోటీలు

తణుకు అర్బన్: వరల్డ్ రోటరీ డే సందర్భంగా తణుకు రోటరీ క్లబ్‌లో ఆదివారం చదరంగ పోటీలు నిర్వహించారు. తణుకు పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన 3 నుంచి 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో 150 మంది విద్యార్థులు హాజరైనట్లు క్లబ్ అధ్యక్షుడు ఆనందం మస్తానరావు (బాబి) తెలిపారు. విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేశారు. అనంతరం చదరంగం మాస్టర్ చరణ్‌ను క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు గమిని రాంబాబు, ఆకెళ్ల సుబ్రహ్మణ్యం, రెడ్డి రంగారావు, వి.పార్వతి, అధికారి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



కార్యక్రమంలో శక్తి వేషాలు, ఇతర నృత్యాలు చేస్తున్న కళాకారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘ నెలవారీ సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. సంఘ 153వ నెలవారీ సభ, సమావేశం ఆదివారం సాయంత్రం గీతా మందిరంలో నిర్వహించారు. అధ్యక్షుడు సూరంపూడి వెంకటరమణ, ప్రధాన కార్యాదర్శి చింతకాయల వంశీ కృష్ణ, కోశాధికారి మాసా బాబూరావు సమావేశాన్ని పర్యవేక్షించారు. నీలాద్రిపురం ఆర్కే ఈవెంట్స్ అధినేత పాముల రామకృష్ణకు గౌరవ సత్కారం, నల్లజర్ల మండలం దూబచర్లకు చెందిన రంగస్థల కళాకారుడు యడవల్లి రాజలింగానికి కళా సత్కారం, ప్రధానోపాధ్యాయులు ఇర్లపాటి వెంకట కృష్ణారావుకు ఉత్తమ ఉద్యోగ సేవ పురస్కారం, పేద కళాకారుడు జి.రాంబాబుకు ఆర్థిక సత్కారం అందజేశారు. శక్తి వేషాలు, డప్పులు నృత్యాలు, సంగీత విభావరి నిర్వహించారు. పట్టణ ప్రముఖులు, కళాకారులు, సాహితీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్లే ఆరోగ్యానికి రక్ష



మాట్లాడుతున్న డాక్టర్ నార్ని భావాజీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): మన ప్రాంతపు ఆహారపు అలవాట్లే మన ఆరోగ్యానికి శ్రీరామ రక్ష అని ప్రముఖ మధుమేహ వైద్య నిపుణులు డాక్టర్ నార్ని భావాజీ అన్నారు. స్థానిక ఎయిర్‌స్ట్రిఫ్ వాకర్స్ అసోసియేషన్ నెలవారీ సమావేశం ఆదివారం వాకర్స్ భవనంలో అధ్యక్షుడు తిరుమళ్ల సూరిబాబు అధ్యక్షతన నిర్వహించారు. డాక్టర్ భావాజీ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ విధానాలపై చర్చించారు. పరిమిత ఆహారం తీసుకోవాలని, తక్కువ ఆయిల్ వాడాలని, వేళప్రకారం ఆహారం తీసుకోవాలని, కల్తీ ఆహార పదార్థాలను గుర్తించి నివారించుకోవాలని, ముడి బియ్యం వాడాలని, వ్యాయామం, యోగా చేయాలని తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కోపల్లె శ్రీనివాస్‌చే నృత్య ప్రదర్శన, వనచర్ల నాగేంద్రప్రసాద్, కప్పల నరసింహమూర్తి, అనిల్, వనచర్ల విజయలక్ష్మి, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి

తాడేపల్లిగూడెం రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్‌ను ప్రతి ఒక్కరూ నిషేధించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.వెంకటేష్ అన్నారు. ఆదివారం మండలంలోని జగ్గన్నపేట, వెంకట్రామన్నగూడెం గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులను వినియోగించాలన్నారు. అలాగే, ఇళ్లల్లో తడి, పొడి చెత్తలను వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలన్నారు. గ్రామ పారిశుద్ధ్యానికి ప్రజలు సహకరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, అల్లూరి సత్యనారాయణ, ఎంఆర్‌సీ ఎం.రవికిరణ్, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


ఉత్సాహంగా మెగా కల్చరల్ నైట్

పోడూరు: ఉల్లంపర్రు మాంటిస్సోరీస్ స్థాపించి 35 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నరసాపురం ఆర్డీఓ దాసిరాజు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఒకే విద్యాసంస్థ నుంచి ఒకే వేదికపై 984 మంది విద్యార్థులతో 52 ప్రోగ్రామ్స్‌తో నిర్వహించిన మెగా కల్చరల్ నైట్ ఎంతో అలరించింది. ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్ట్ రవి మిమిక్రీ ప్రేక్షకులను ఎంతో అలరించింది. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంఈఓ జి.వీరాస్వామి, స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దాల రాంప్రసాద్, డైరెక్టర్ అండ్ అడ్మినిస్ట్రేటర్ మద్దాల వాసు, ప్రిన్సిపాల్ వసంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య సేవలు

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇంటికే పరిమితమైన వృద్ధులకు ఉచిత వైద్య సేవలందించారు. తణుకు, వెంకటరాయపురం, సజ్జాపురం ప్రాంతాల్లోని 8 మంది ఇంటికి పరిమితమైన వృద్ధుల వద్దకు వెళ్లిన ప్రముఖ సీనియర్ నేత్ర వైద్యుడు హుస్సేన్ అహ్మద్, ఆర్థో వైద్యుడు నిమ్మగడ్డ అచ్యుతరామయ్య వైద్యసేవలందించారు. వేల్పూరుకు చెందిన ఆరిమిల్లి చక్రధరరావు ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకరచౌదరి తెలిపారు. ఉచిత వైద్యసేవలు అవసరమైన వారు 99853 43530, 9059290717 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



ప్రశ్నాపత్రాన్ని విడుదల చేస్తున్న లక్ష్మీపతిరాజు, సమాఖ్య సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ప్రతి విద్యార్థీ తన విద్యార్థి దశలోనే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు వెళ్లాలని పట్టణ వైద్యుడు ఎం.లక్ష్మీపతిరాజు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎంఎంకేఎస్‌ఎం మునిసిపల్ హైస్కూల్లో విద్యా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో ఏడు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పాటవ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీపతిరాజు మాట్లాడుతూ చిన్నతనం నుంచే ఒక ఆశయంతో చదవాలని ఆ ఆశయమే ఏదో ఒకరోజు మిమ్మల్ని ఉన్నత స్థాయికి తీసుకువెళుతుందని అన్నారు. చదువుతున్నంత సేపు ఇతర విషయాలను పట్టించుకోకుండా మీలో మీరే పోటీగా చదువుకోవాలన్నారు. చైతన్య సమాఖ్య కార్యదర్శి పోలిశెట్టి శ్రీశ్రీ మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా ఈ ప్రతిభాపాటవ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షకు పాలకొల్లు డివిజన్ పరిధిలో పాలకొల్లు పట్టణం, పాలకొల్లు, పోడూరు, ఆచంట,యలమంచిలి, వీరవాసరం మండలాలకు చెందిన విద్యార్థులు సుమారు 400 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పితాని ధర్మారావు, తోలేటి గాంధీ, జవ్వాది నాగేశ్వరరావు, మంచెం కనకరాజు, కింజరాపు దుర్గాప్రసాద్, కొంతేటి ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.